క్లుప్తంగా

రూ.30 లక్షలతో రైల్వేస్టేషన్‌కు రోడ్డు



రైల్వేస్టేషన్ వరకు జరుగుతున్న నిర్మాణ పనులు

బనగానపల్లె: బనగానపల్లె రైల్వేస్టేషన్ వెళ్లేందుకు రూ.30 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు రైల్వే ఏఈ అమ్రేత్ సింగ్ తెలిపారు. రైల్వేలైన్ పక్క భాగంలోనే రైల్వేస్టేషన్ వరకు వెళ్లేందుకు వీలుగా ఈ రహదారిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ రహదారిని సీసీరోడ్డుగా ఏర్పాటు చేస్తున్నామని.. నిర్మాణ పనులు త్వరలో పూర్తవుతాయని తెలిపారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ



దుకాణాలను తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్

బేతంచెర్ల: దుకాణాల్లో విక్రయించే వస్తువులకు ఎంఆర్‌పీ, కంపెనీ అడ్రస్, తయారీ తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా ఉండాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని వస్త్ర, కిరాణ, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపులను తనిఖీ చేసి పలు వస్తువులకు తయారీ, కంపెనీ పేరు, ఎంఆర్‌పీ తదితర వివరాలు సక్రమంగా లేకపోవడంతో కేసులు నమోదు చేశారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



ముక్కమల్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

సంజామల: గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి గోపాల్ అన్నారు. మండల పరిధిలోని ఆకుమల్ల, ముక్కమల్ల గ్రామాల్లో డీఈ క్రిష్టారెడ్డితో కలిసి గురువారం పర్యటించారు. హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు సకాలంలో పడుతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అడిషనల్ బిల్లులు కూడా మంజూరవుతాయని పేర్కొన్నారు. పీడీతో పాటు హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందుకున్న డ్వాక్రా ఆర్పీలతో ఎమ్మెల్యే

డోన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో డ్వాక్రా మహిళా సంఘాల రీసోర్స్ పర్సన్స్(ఆర్పీలు)కు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం శ్యాంసంగ్ గెలాక్సీ ఏ9 ప్లస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ సభ్యులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ట్యాబ్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, మెప్మా అధికారులు, రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

ఉసేన్‌వలి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌వలిస్వామికి ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌వలిస్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. శుక్రవారం నుంచి మొహర్రం నెల ప్రారంభం కానుండగా మరో 40 రోజులపాటు మంచి రోజులు లేకపోవడంతో చివరి వారం దర్గా భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్గాకు చేరుకున్నారు. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికిఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా రేవనూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఏజీపీగా శేషశయనరావు

డోన్ టౌన్: డోన్ సబ్ కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది జి.శేషశయనరావును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన నియామకంపై న్యాయవాదులు హరిమురళీధర్‌రావు, ఆంజనేయగౌడ్, చిన్నరంగారెడ్డి, రాముడు, శ్రీరాములు, రామలింగయ్య హర్షం వ్యక్తం చేశారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- రూ.36 కోట్లతో బీసీ రెసిడెన్షియల్ స్కూలు, కళాశాల ఏర్పాటు
- త్రిఫేస్ విద్యుత్ సరఫరా లేక విద్యార్థులకు తప్పని ఇక్కట్లు
- ఐటీఐ, ఎంఎస్‌ఎంఈ భవనాలకు త్రిఫేస్ విద్యుత్ లేక ఖాళీగా..
- అర్థంతరంగా నిలిచిపోయిన వాల్మీకి భవన్ పనులు
- పట్టించుకోని కూటమి సర్కారు



బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల



త్రిఫేస్ విద్యుత్ లైన్ లేక నిరుపయోగంగా ఐటీఐ భవనం



త్రిఫేస్ విద్యుత్ లైన్ లేని ఎంఎస్‌ఎంఈ భవనం



బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల వద్ద ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్‌ఫార్మర్



అసంపూర్తిగా వాల్మీకి భవనం

బేతంచెర్ల: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యతోపాటు సాంకేతిక విద్యను అందించాలనే సద్దుదేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో మండలంలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలో రూ.36 కోట్లతో బీసీ బాలుర పాఠశాల, కళాశాల, రూ.7.50 కోట్లతో ఐటీఐ, రూ.4 కోట్లతో ఎంఎస్‌ఎంఈ మంజూరు చేశారు. భవనాలు మంజూరు కాకముందు వరకు బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలను పట్టణంలోని ధరణి టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్లో 2022, 2023 వరకు తరగతులు నిర్వహించారు. 2024లో గోరుమాను కొండ వద్ద రూ.36 కోట్లతో నిర్మించిన బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో విద్యాసంస్థను అక్కడికి తరలించారు. ప్రస్తుతం అక్కడ 680 మంది విద్యార్థులున్నారు. అయితే త్రిఫేస్ విద్యుత్ లైన్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పుడుతున్నారు. ఒక్కోసారి అధికలోడు కారణంగా ఫీజు పోయినా, రాత్రి వేళ ఏదైనా అంతరాయం ఏర్పడినా ఉదయం వరకు బాలలు అంధాకారంలో మగ్గాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా త్రిఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

17 నెలలుగా నిరుపయోగంగా ఐటీఐ, ఎంఎస్‌ఎంఈ

రూ.7.50 కోట్లతో నిర్మించిన ఐటీఐ, రూ.4 కోట్లతో నిర్మించిన ఎంఎస్‌ఎంఈ వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభించారు. సుమారు 17 నెలల క్రితం భవనాలు ప్రారంభించినా త్రీఫేస్ విద్యుత్ లైన్ లేక నేటి వరకు నిరుపయోగంగా ఉన్నాయి. దాదాపు 300 మంది విద్యార్థులు ఉన్న ఐటీఐ ప్రస్తుతం బేతంచెర్లలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో కొనసాగుతోంది.

వాల్మీకి భవనం 80 శాతం పనులు పూర్తి

హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో రూ.2 కోట్లతో చేపట్టిన వాల్మీకి భవన్ వైఎస్సార్‌సీపీ పాలనలో 80 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం మిగిలిన 20శాతం పనులు పూర్తి చేయడంలో కూటమి సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో భవనం నిరుపయోగంగా ఉండిపోయింది. ఈ భవన నిర్మాణాన్ని ఈఏడాది జనవరి 31న జిల్లా కలెక్టర్ రాజకుమారి పరిశీలించినా నేటి వరకు పురోగతి లభించకపోవడం విశేషం. వైఎస్సార్‌సీపీ పాలనలో భవనాలు నిర్మించడంతోనే కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలున్నాయి.

రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ

సంజామల: రైతులకు మినుములు, కందులు, జొన్న విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి భూమా జ్యోతి తెలిపారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా సంజామల రైతు సేవా కేంద్రానికి వచ్చిన విత్తనాలను గురువారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. కంది ఎల్‌ఆర్‌జీ105, 52 రకాలు 26 క్వింటాలు, మినుములు టీబీజీ 104, వీబీఎన్8, ఎల్‌బీజీ884 రకాలు 56 క్వింటాలు, జొన్న సీఎస్‌వీ 41 రకం 10 క్వింటాలు మంజూరయ్యాయని వెల్లడించారు. మినుము, కంది, జొన్న పంట వేసే రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. తప్పనిసరిగా ఈ–క్రాప్ చేయించుకోవాలని తెలిపారు. ఏఈఓలు శ్రీకాంత్, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు కోవెలకుంట్లలో బ్యాంక్ ప్రారంభం

కోవెలకుంట్ల: పట్టణంలోని నాగులకట్ట సమీపంలో కెనరా బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆ బ్రాంచ్ మేనేజర్ సద్దాం అలీ తెలిపారు. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల ప్రజల సౌకర్యార్థం కోవెలకుంట్లలో బ్యాంకు సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కెనరా బ్యాంకు తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ మీతాంతయ, కర్నూలు రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ

కొలిమిగుండ్ల: కులమతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. గురువారం తిమ్మనాయినపేటలోని పీర్ల చావిడి వద్ద కమిటీ సభ్యులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి గొడవలు లేకుండా ఆనందోత్సాహాల మధ్య పండుగ చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. అల్లర్లకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత



కార్ల్ లాండ్‌స్టీనర్‌కు నివాళులర్పిస్తున్న ఎంఈఓ

డోన్: సమాజ హితం కోసం కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత అని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రక్తాన్ని వర్గీకరించిన నోబెల్ అవార్డు గ్రహీత కార్ల్ లాండ్‌స్టీనర్ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని చిన్నమల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. వైద్యాధికారి చెన్నకేశవులు, చెన్నయ్య, పద్మావతి, ఆనందరావు, వనజ, వీరభద్రయ్య, సునిత, స్వాతి, సామాజిక కార్యకర్త రఫీ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా గుడికి రూ.50వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని షిర్డీ సాయిబాబా ఆలయం అభివృద్ధి కోసం బేతంచెర్ల పట్టణానికి చెందిన ఈడిగ లోకేష్ గౌడ్ రూ.50,116 విరాళాన్ని అందజేశారు. గురువారం ఆలయంలో సాయిబాబాకు పూజలు చేసి ఆలయ కమిటీ సభ్యులు ధర్మారం సుబ్బారెడ్డి, పార్థసారథి, ఆలా మల్లికార్జునరెడ్డిలను కలిసి విరాళం ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీలో కార్యదర్శుల నియామకం



మధుసూదన్‌రెడ్డి

డోన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగంలో రెండు కీలకమైన పదవులు డోన్ నియోజకవర్గానికి దక్కాయి. రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా ప్యాపిలి మండలం మెట్టుపల్లె గ్రామానికి చెందిన మెట్టు వెంకటేశ్వరరెడ్డి, సహాయ కార్యదర్శిగా డోన్ మండలం దేవరబండ గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి నియామకంపై రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, డోన్, ప్యాపిలి ఎంపీపీలు రేగటి రాజశేఖర్‌రెడ్డి, గోకుల్ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: నైతిక విలువలతో కూడిన నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమైందని కొత్తపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా స్కూల్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళుతున్న రాంప్రసాద్, అబ్దుల్ రఫీ, రంగారెడ్డి, నీరజ, సుబ్రమణ్యం, సుధాకర్‌లను గురువారం సన్మానించారు. వారి స్థానాల్లో ఇక్కడికి వచ్చిన రామ్మోహన్, జగదీశ్వరయ్య, లక్ష్మానాయక్, లక్ష్మణ్‌దాసులకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్ కుమార్, రఘునాథ్, భాగ్యలక్ష్మి, శాంతి, స్కూల్ చైర్మన్ మక్బూల్‌బాషా పాల్గొన్నారు.

పెద్దమ్మకు విశేష పూజలు



పూజలందుకున్న పెద్దమ్మ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో పెద్దమ్మదేవర ముగిసి 16రోజులు అయిన సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయానికి సామూహికంగా బోనాలు తీసుకొచ్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

లేబర్ కోడ్స్‌పై ప్రభుత్వ తీరు దారుణం

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్స్‌ను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీ జరగనున్న సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

నిధుల విడుదలపై హర్షం



కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేస్తున్న ముస్లింలు

బనగానపల్లె: బనగానపల్లెలో మొహర్రం వేడుకలకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు కావడంతో గురువారం ఆస్థానం వద్ద షియా ముస్లింలు, మత గురువులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్‌హైదర్, బురానుద్దీన్, అమీర్‌జాన్, అల్తాఫ్, మహబూబ్ బాషా, జాలిష్, షేక్షావలి, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరులో గోరుమానుకొండకు 10వ స్థానం



సర్పంచ్ వెంకటేశ్వర్లు

బేతంచెర్ల: ఉత్తమ పనితీరులో బేతంచెర్ల మండలం గోరుమానుకొండ గ్రామ పంచాయతీ జిల్లాలో 10వ స్థానం కైవసం చేసుకుంది. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి లైట్లు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా 83.3 శాతం వచ్చింది. గ్రామ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించిన సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామస్తులు గురువారం అభినందించారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



రాతి దూలం లాగుతున్న వృషభాలు

బనగానపల్లె రూరల్: యాగంటిపల్లె గ్రామంలో పెద్దమ్మ తల్లి 16 రోజుల పండుగ సందర్భంగా గురువారం నిర్వహించిన న్యూ క్యాటగిరి విభాగం వృషభాల రాతిదూలం పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 14 జతల వృషభాలు పాల్గొన్నాయి. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.60 వేలు, రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5 వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

తలనీలాల వేలంలో రూ.1.85 కోట్ల ఆదాయం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి తలనీలాల వేలం ద్వారా రూ.1.85 కోట్ల ఆదాయం లభించిందని ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆలయంలో ఏడాది కాలానికి సంబంధించి స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించే తలనీలాల పోగు హక్కుల కోసం గురువారం వేలం పాట నిర్వహించారు. గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన నాగరాజు రూ.1,85,40,000 హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు.

అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

డోన్ టౌన్: అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామభూపాల్ అన్నారు. మలేరియ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా గురువారం గ్రామంలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ఇళ్ల పరిసరాల్లోని పాతటైర్లు, కొబ్బరి బోండాలు, డ్రమ్ముల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమతెరలను వినియోగించాలన్నారు. చలి జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఆఫీసర్ వెంకటలక్ష్మీ, సూపర్‌వైజర్ నాగరత్న, నర్సులు పెద్దక్క, గీతా, కల్యాణి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం



కోవెలకుంట్ల: కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



బనగానపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులు

కోవెలకుంట్ల: మత్తుపదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయని.. యువత వాటికి దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కాలంలో డ్రగ్ మాఫియా తినుబండారాల్లో మత్తు మందు కలిపి విక్రయాలు జరుపుతున్నారని, వాటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటుపడినట్లు గుర్తిస్తే డ్రగ్స్ డీ అడిక్షన్ కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎక్సైజ్ సీఐ తకీబాషా, ఎస్‌ఐలు సందీప్ యాదవ్, నాయక్ అవగాహన కల్పించారు. ఈగల్ క్లబ్ కో–ఆర్డినేటర్లు రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, అధ్యాపకులు నరేంద్రనాథ్‌రెడ్డి, సంటిరెడ్డి, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి పాల్గొన్నారు.

- బనగానపల్లె రూరల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బనగానపల్లె ఎక్సైజ్ సీఐ సతీష్ అన్నారు. పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత మాదకద్రవ్యాల జోలికి వెళితే భవిష్యత్ అంధకారమవుతుందని తెలిపారు. చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటే జీవితం అందంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.
- ప్యాపిలి: మాదకద్రవ్యాల నుంచి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సీఐ వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ మధుసూదన్ అన్నారు. గురువారం ప్యాపిలిలో జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాలకు అలవడితే ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే అన్నారు.



ప్యాపిలిలో..

ప్రజా సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. పట్టణంలోని వైఎస్ నగర్, శ్రీరామ నగర్‌లలో గురువారం జరిగిన సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌తో కలిసి పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేటికి ఏడాడి గడిచినా ఎలాంటి నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. అలాగే కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీని నేరవేర్చకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. నాయకులు రాముడు, నారాయణ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం



రోటరీ క్లబ్ నూతన కార్యవర్గంతో జిల్లా గవర్నర్

బేతంచెర్ల: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా గుండా అశ్వర్థ నారాయణ, కార్యదర్శిగా రాజేష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా గవర్నర్ కేశవరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ సత్తార్ హాజీ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ద్వారా విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రామలు చేపట్టాలని సూచించారు. అనంతరం పేద మహిళ జీవనోపాధి నిమిత్తం కట్టు మిషన్ అందజేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు గుండా గోపాల్, వీరారెడ్డి, ప్రశాంత్‌కుమార్ రెడ్డి, విజయ నాగరాజు, మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.